



పగలంతా డ్యూటీ చేసిన సూర్యుడు పడమటి కొండల వెనుకకు ఆవలిస్తూ నడుం వాల్చుతున్న వేళ, ఆహారార్థం వెళ్ళిన పక్షులు, ఆఫీసులకు వెళ్ళిన మనుషులు గూళ్ళకు చేరుతున్న వేళ—

—చేతిలో చిన్న కాకీ సంచితో రాజా ఇంటిముందు నిలిచి, తలుపు తట్టాడు గోపాలం.

మేడ మీదనుంచి తొంగిచూపిన రాజా-లోపలికొచ్చి, పైకిరమ్మని సంజ్ఞ చేసాడు గోపాలానికి. నెమ్మదిగా గేటు తీసుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ ఇంటి గడప దాటి లోపలకి వెళ్ళి, మెట్లెక్క సాగాడు గోపాలం. రోజూలాగ లేదు ఈ రోజు అతని నడక. మనిషి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

బొమ్మల చొక్కా, గళ్ళలుంగీ

పులిగోరు పతకం ధరించిన రాజా-కాకిప్యాంటు. అకుపచ్చ చొక్కా-ధరించిన గోపాలం చేతిలోని సంచీ చూసి విస్తుపోయాడు.

"అయితే వెళ్ళడానికే నిశ్చయించుకున్నావా?" అన్నాడు ఆశ్చర్యంగానే.

అవుననీ, కాదనీ ఎటూ తేల్చలేని అర్థమొచ్చేలా తలాడించాడు గోపాలం. తన ప్రశ్నని రెండు సార్లు రెట్టించాడు రాజా. రెండు నిముషాలు పోయేక చటుక్కున తలెత్తాడు గోపాలం.

"రాజా! నేనీ పని ఎంతో ఆలోచించాకే చేస్తున్నాను. శేఖరం నుంచి మళ్ళీ వుత్తరం వచ్చింది. క్రొత్త పిక్చరు మొదలవుతోందిట. డైరెక్టరుగారు రేపు, ఎల్లుండి హైద్రాబాదులోనే వుంటార్ట. నన్ను ఆయనకు పరిచయం చేస్తానని వ్రాసాడు. కానీ నాన్న తనని వదిలి వెళ్ళడానికి ఒప్పుకోడని నీకు తెలుసు కదా! ఈ కాలేజీ చదువు పూర్తి చేసినా నాకు ఉద్యోగం రాదని నమ్మకంగా చెప్పగల్ను. రోజూ నిరుద్యోగులుగా మనకళ్ళ ముందు తిరుగుతూన్న మన సోదరుల్ని చూస్తూ కూడా ఎలా ఆశ పెట్టుకోగలం? పైగా నాలోని కళ నన్ను సినిమాల్లో ఛాన్సుకోసం ప్రయత్నించమనే చాలా నాళ్ళుగా వుత్సాహపరుస్తోంది. ఈ నాటికి అవకాశం, తెగింపు వచ్చాయి. రాజా! స్నేహితుడుగా నిన్నొక్కటే కోరుతున్నాను. మా నాన్నకు ఇక నువ్వే కొంచెం ధైర్యం చెప్పాలి. ఎదైనా మంచి వుద్యోగం సంపాదించుకుని తిరిగి వచ్చేస్తానని చెప్పు. నేను లేకపోయినా జీవితాంతం తన ఒక్కడి పొట్ట తను పోషించుకోగలడాయన. ఇంకెవరున్నారు మా ఇంట్లో? ఈ మాత్రం సహాయం చెయ్యగలవని నమ్ముతున్నాను" అన్నాడు గోపాలం-రాజా చేతులు పట్టుకుని.

రాజా గోపాలం కళ్ళల్లోకి చూసాడు.

"మీ నాన్నకు ధైర్యంచెప్పడం పెద్ద కష్టమయిన పని కాదనుకో, కానీ ఏ విషయం- సినిమా వాళ్ళని నమ్మకూడదు. ఛాన్సిస్తామనే మోసం చేస్తూంటారు. అనవసరంగా దారి ఖర్చులు దండగేమో చూసుకో."

"ఛాన్సు తప్పకుండా దొరుకుతుందనే నమ్మకం వుంది నాకు. ఆరుమూడయినా మూడు ఆరయినా, ఎన్నాళ్ళు ఎన్ని కష్టాలు పడైనాసరే అక్కడేవుండి ఆ రంగంలో ఒక స్థిరమైన స్థానం సంపాదించు

కున్నాకే ఈ వూళ్ళో అడుగు పెట్టాను. ఇది ఒక ప్రతిజ్ఞగా కూడా నువ్వు భావించవచ్చు" ఆవేశంగా, దృఢసంకల్పంతో అన్నాడు గోపాలం.

"భేష్! అన్నట్టు, ఈ విషయం మనిద్దరికీ తప్ప మూడోవాడికి తెలియదు కదూ?"

"తెలియదు."

"ఉఁ....డబ్బేమైనా కావాలా?"

"వద్దు. నా దగ్గర పోగుచేసుకున్నది కొంత వుంది. అదిచాలు."

"గుడ్. బెస్టాఫ్ లక్."

"థేంక్యూ."

—అర్ధనిమీలితనేత్రుడై, మనస్సులో నవ్వుకున్నాడు.

రాజాకూడా అర్ధనిమీలిత నేత్రుడై, ఓరగా నవ్వేడు-ఏదో ఆలోచనలోకి జారుతూ.

* * *

"నిన్న పొద్దున్న నేను ఇస్కూలు కెళ్ళేటప్పుడు యింటికాడే వున్నాడు మేష్టరుగారూ! ఒంటో బాగోలేదు, ఇయ్యాల కాలేజీకి ఎల్లను అన్నాడు. మరెక్కడికెల్లాడో? రాత్తిరి ఎంతకీ రాకపోయేతలికి నాకు గుండెల్లో రాల్లు పడ్డాయి. రాత్తిర్నుంచీ కంటిమీద కునుకు లేదు. రాజా బాబుగారింటికూడా యెల్లొచ్చా బాబూ. ఆరికీ తెల్దన్నారు" పైగుడ్డతో కళ్ళుతుడుచుకుంటూ, మోకాళ్ళమీద కూలబడి అన్నాడు సముద్రాలు - క్షీరసాగరం మేష్టారితో.

"మరేం కంగారు పడకురా సముద్రాలూ! వాడికి చెడు స్నేహాలేవీ లేవు, మరేం ప్రమాదంకూడా లేదు వాడికి. ఈ వాళ స్కూల్లో ఈ విషయం పడేశామంటే కుర్రాళ్ళంతా క్షణాల్లో వూరంతాగాలించి, భోగట్టా పట్టుకొస్తారు. మరేం కంగారు పడకు"—పడక్కుర్చీలో నెమ్మదిగా నడుం వాల్చి, పేపరు అందుకుంటూ సెలవిచ్చారు మేష్టారు.

"ఏఁవోఁనండి మేష్టరుగారూ! ఎప్పుడూ ఆడు సెయ్యలేదు. నా పేణం పీకేత్తన్నాది. మొత్తం కుటుంబంలో మిగిలిన ఒక్కగానొక్క నలుసుయాడు. ఈడుకూడా ...." వెక్కిళ్ళొచ్చాయి సముద్రాలుకి.

"ఛఛఛ ఏవిట్రా యిదీ సముద్రాలూ! ఆఁ? చంటి పిల్లాడులా ఆ ఏడుపేవిటీ? ఊరుకో! పాతిక సంవత్సరాల్నుంచీ స్కూల్లో పని చేస్తున్నావారేయ్ నువ్వు— అటు మేష్టర్లలోనూ, ఇటు కుర్రాళ్ళల్లోనూ కూడా నువ్వంటే ఆదరాభిమానాలున్నాయి. నీ కొడుకువి

సాయంత్రావి కల్లా పీ కప్పజెప్పు తారు. సరా?"—మందలిస్తూన్న ధోరణిలో ధైర్యం చెప్పారు మాష్టారు.

"తవఁ మాట పెకారం ఆ డలాగే వచ్చేస్తే—తవఁరే దేవు డనుకుంటాను మేష్టారు గారూ" —సముద్రాలు కళ్ళల్లో ఆశ.

"అందులో నీకు అనుమానం అక్కర్లేదు. సాయంత్రానికల్లా వాడు పీ ఇంటి దగ్గర సిద్ధం. అవునూ—వాడు నిన్నకూడా ప్రైవేటుకి రాలేదు. ట్యూషన్ ఫీజు వాడి చేతికిచ్చి పంపించావా ఏఁ మిటీ? ఒకవేళ అదుచ్చుకుని...." అనుమానంగా నపిగాడు మేష్టారు.

"ఛఛఛ ఆడు అట్టాంటోడు కాదు మేష్టారుగారూ! తవఁకి తెలిన్దేఁ వుందండీ. అసలు ఆడి చేతికి డబ్బులియ్యే లేదండి నేను. ఒక్కరెండు రోజుల్లో తవఁకి డబ్బులు నద్దేస్తానండి"

"సర్లె సర్లె.... మధ్యాహ్నం ఓ సారి ఇంట్లో కనిపించు—ఏవో సరకులు తేవాల్ట.... పోయిరా పోయిరా"-ట్యూషన్ ఫీజు ఇంకా తన చేతికి రావడానికి రెండు రోజులు పట్టుతుందనే సరికి మేష్టారు ఇబ్బందిగా ఫీలయి, పేపరు చాటున మొహం దాచుకుని, మర్యాదగా వెళ్ళమని తొందర పెట్టారు సముద్రాల్ని.

"వస్తానండి మేష్టారుగారూ— నమస్కారం"

—ప్రతి నమస్కారానికి ప్రతీకగా పేపరు చప్పుడు చేసారు మేష్టారు.

.... .... ....

తలుపు తీసి, అవతలి వ్యక్తుల్ని చూస్తూనే కలవరపడ్డాడు రాజా.

"ఐ థింక్ యు ఆర్ మిస్టర్ రాజా!"

"యు....య్యెస్సర్. ప్లీజ్ కమిన్"

"మీ నాన్నగారితో బాగా పరిచయం వుంది నాకు. ఉన్నారా ఇంట్లో?"— లోపలకి వచ్చి కూర్చుంటూ అన్నాడు పోలీసు ఆఫీసరు.

"లేరండీ! మొన్ననే హైద్రాబాదు వెళ్ళారు."

"అఛ్ఛా! మిస్టర్ రాజా! నిన్న రాత్రి ఎనిమిది గంటల సమయంలో మీరు ఎక్కడున్నారు?"

"ఇంటి దగ్గరే వున్నానండీ. ఏఁవండి? ఏఁవయింది?" అదుర్దాగా అడిగాడు రాజా.

"చెప్తా. ఇంటి దగ్గరే వున్నా నన్నారు కదూ? రోజూ మీరు కాలవ

ఒడ్డుకి షికారుకి వెళ్తూంటారు కదూ?"

"అవునండీ. కానీ రెండ్రోజు ల్నించి మానేశాను"

"ఎందుచేత?"

"పరీక్షలు దగ్గర పడుతున్నాయి కదండీ-చదువుకుంటున్నాను"

"ఊ.... మీకు రాయుడు తెలుసుకదూ?"

"తెలుసండి—ఏఁవండీ?"

"నిన్న మీకు కలిసాడా అతను?"

"నిన్న?—ఆఁ మధ్యాహ్నం చూసాను అతన్ని."

"ఎక్కడ?"

"కాలేజీ దగ్గర. మేమిద్దరం ఓ అరగంట సేపు ఏవో సినిమా కబుర్లు చెప్పుకున్నాం కూడా."

"ఈ వూళ్ళో అతనికి శత్రువు లెవరైనా వున్నారా?"

"నాకు తెలిసి యెవరూ లేరండి."

"గతంలో మీ ఇద్దరికి శత్రుత్వం వుండేదిట కదూ?"

"నిజమే- కానీ ఇప్పుడు మేము బెస్ట్ఫ్రెండ్సుం"

"ఊఁ....మిస్టర్ రాజా! ఎ బేడ్ న్యూస్ ఫర్ యూ....నిన్న రాత్రి కాలవ వొడ్డు దగ్గర రాయుడు హత్య చెయ్యబడ్డాడు."

—అదిరిపడ్డాడు రాజా. తల వంచుకుని నుదురు రాసుకుంటూ వుండిపోయేడు.

"మీరు మాతో కో-ఆపరేట్ చేస్తే ఎవరుచంపారో తెలుసుకోగలుగుతాం."

—రాజా తలెత్తలేదు. బాధ పడుతూ అలాగే వుండి పోయేడు.

"ఓకే మిస్టర్ రాజా! మీకేమైనా ఇన్ఫర్మేషన్ తెలిస్తే మాత్రం మాకు తెలియజెయ్యండి" అంటూ లేచాడు పోలీస్ ఆఫీసరు.

"ఆగండి సార్. ఇప్పుడు నాకు ఒకరిమీద అనుమానం వస్తోంది"

చటుక్కున కూర్చుని, ముందుకి వంగి, ఉత్సాహంగానూ, ఉత్సుకతతోనూ చూసాడు పోలీసు ఆఫీసరు రాజా మొహంలోకి.

.... .... ....

"ఊఁ— నీ పేరేవిటన్నావ్?"

"సముద్రాలు బాబూ"

"ఏం పని చేస్తూంటావు?"

"మునిసిపల్ ఇస్కూల్లో ప్యూన్నండి. పాతికేళ్ళుగా సేత్తన్నాను బాబూ. ఒక్క సారి కూడా...."

"సర్లె సర్లే. నీ కొడుకు పేరేవిటి?"

"గోపాలం బాబూ."

"ఆఖరుగా ఎప్పుడు చూసావు నువ్వు వాణ్ణి?"

"నిన్న పొద్దున్న ఇస్కూలు కెళ్ళే ముందు సూసాను బాబూ. రాత్తిర్నుంచీ బెంగెట్టేసుకున్నాను బాబూ. అదేటైపోయేడో ఏటో? ఎప్పుడూ ఇలా సెయ్యలేదు బాబూ. బాబూ తవఁరే ఆడిగురించి...."

"అదే అదే....మా వుద్దేశ్యం కూడా అదే లేరా. ఊఁ....వాడికి శత్రువులు వున్నారా ఎవరైనా?"

"ఆడికి శతృవులేంటి బాబూ? శ్రీరామచెంద్రుడు బాబూ ఆడు. ఎవరైనా కట్టంలో వుంటే సూళ్ళేడు బాబూ"

"ఊఁ...నీకురాయుడుతెల్సా?"

"రాయుడా?....ఎవరో నాకు తెల్దు బాబూ"

"ఊఁ....ఆ రాయుణ్ణి నిన్న చంపేశారు."

"శ్రీరామచెంద్రా.... ఎవరు బాబూ?"

"ఊఁ... నీ కొడుకు ఇంతకు ముందెన్నడూ నీకు చెప్పకుండా ఎక్కడికీ పోలేదన్నావు కదూ? ఇప్పుడు మాత్రం ఎందుకు పారిపోయుంటా డంటావు?"

"ఏటో తెల్దం లేదు బాబూ. అయినా పారిపోవలసిన అవుసరం ఏటి బాబూ ఆడికి?"

"ఊఁ....వాడూ, హత్య చేయబడిన రాయుడూ బద్ధ శత్రువులు. నిన్న మధ్యాహ్నం ఇద్దరూ కొట్టుకున్నారు కూడా. 'నీ అంతం చూస్తాన్రా' అన్నాట్ట నీ కొడుకు. అలాగే రాత్రి అంతపనీ చేశాడు."

"ఏటి బాబూ తవఁరు సెప్పేది.... నా కొడుకు .... నా కొడుకు... నిజవేఁనా బాబూ తవఁరు సెప్పేది?"- సముద్రాలు కాళ్ళు నేల మీద నిలువనంటున్నాయి. వింటి నారిలా వున్న చోటనే వణికి పోతున్నాయి.

సర్కిల్‌గారి సంజ్ఞని శిరసా వహించిన నల్ల జవాను మొరటు చెయ్యి సముద్రాలు మెడ మీద పడింది.

ముందుకు తూలి, సర్కిల్ కాళ్ళ దగ్గర పడ్డాడు సముద్రాలు.

జుట్టు పట్టుకు లేవనెత్తాడు జవాను సముద్రాల్ని. "అయ్యగార్నే అబద్దాలాడు తున్నా రంటావుట్రా తొత్తుకొడకా" అని కసిరాడు.

"లేదు బాబూ...లేదు బాబూ నేను...."

"నోర్ముయ్. చెప్పు- నీ కొడుకుని ఎక్కడ దాచావు? ఏ వూరు పంపించావు?"

—అవాక్కయి పోయి, కళ్ళు

మిటకరించి అలాగే నిలుచుండి పోయాడు సముద్రాలు.

"ఏటి బాబూ? నేను.... నేను... లేదు బాబూ. మీ కాళ్ళట్టు గుంటాను. అసలాడు యెక్కడికి పోయేడో తెలీకే యిచారంతో కుళ్ళిపోతున్నాను బాబూ. అలాం టిది నేను ఆడ్నీ పంపించడవేఁటి బాబూ? బాబూ- ఆడ్నీ మీరే పట్టు కోండి. ఆడుగాని అలాంటి ఎదవ పని సేసాడని రుజువైతే మీ కళ్ళెదురుగానే ఆణ్ణి నరికి పోగు లెడతాను. ఆడు అలాంటాడు కాదు బాబూ ..."

"నోర్మూయ్. అబద్దాల తొొత్తు కొడక"

సర్కిల్‌గారి సంజ్ఞని అందు కుని, సముద్రాల్ని ప్రక్కగదిలోకి తీసుకెళ్ళాడు హెడ్ కానిస్టేబుల్.

"ఇదుగోముసలాడా! చూడు-నీ చేతెలాగైనా మేము రహస్యం చెప్పించగలం. అనవసరంగా యెందుకు ఈ వయసులో దెబ్బలు తింటావు చెప్పు? నీ కొడుకు కాదు కదా, ఆ దేవుడైనా హత్యచేసి తప్పించుకోవడం జరిగేపని కాదు. మర్యాదగా చెప్పెయ్యి! నేనూ నీ వయస్సు వాణ్ణే కాబట్టి నిన్ను బాధ పెట్టాలంటే చేతులు రావడం లేదు" అన్నాడు హెడ్డు- సర్కిల్ గారెదురుగా క్రిందకు వాలిన మీసాల్ని పైకి తోసుకుంటూ.

"అయ బాబిదేంటండి నాయ నోయ్. మా కేటి తెల్దు బాబయ్యా. దేవుడులాంటి నా కొడుకు మీదకి యిల్లాంటి నేరాలు తొొయ్యకండి బాబూ" అంటూ హెడ్డు కాళ్ళని చుట్టేసుకున్నాడు సముద్రాలు.

"ఓరి ముసల్నా కొడకా! ఇదేవిటి?! ముందులే. ఆఁ. నీ కిలా కాదు. ఇదిగో టూ ట్వెంటీ. వీడి సంగతి చూస్కో నువ్వు" అని సముద్రాల్ని కానిస్టేబుల్‌కి అప్ప గించి, గదిబయటకు వచ్చేసాడు హెడ్డు.

మీద పడ్తూన్న ఒక్కొక్క దెబ్బకీ వెన్ను బద్దలవుతున్నట్లు వుంది సముద్రాలుకి. తనకు అల సట వచ్చేవరకూ లాఠీవిరిగేవరకూ కొట్టి, "ష్-చెప్పట్లేదండీ ఈ లంజ కొడుకు" అంటూ వచ్చి, హెడ్ గారికి రిపోర్టిచ్చాడు కానిస్టేబుల్. ఆ విసుగులో వేరేగా ఎలా చెబ్దామా అని ఆలోచించ కుండా శ్రమ లేకుండా ఆ వాక్యాన్ని అలాగే సర్కిల్‌గారికి చెప్పాడు హెడ్డు.

లాకప్‌లో పెట్టి తిండీ నీళ్లూ లేకుండా మాడ్చమని సాలోచనగా ఆర్డరిచ్చారు సర్కిల్‌గారు- మందు

పుచ్చుకుంటూ. మందు దిగాక పై ఆఫీసర్లకు రిఫర్ చేసారు కేసుని.

రెండు పగళ్ళు, రెండు రాత్రులూ గడిచి, మూడో పగలు కూడా వెళ్ళి పోతానంటూండగా, చల్లబాటువేళ పోలీస్టేషన్ ముందు దిగారు డియస్పీ దొరగారు. దొర గారికి సెల్యూట్ చేసింది స్టేషన్. ఆయ నంటే వణికి చస్తోంది. లోపలి కొచ్చాక ఆ ఫైలూ, ఈ ఫైలూ కాసేపు తిరగేసి, రాయుడి మర్డర్ విషయాని కొచ్చారు దొరగారు.

ఆయన ఆర్డరు మీద ఇద్దరు పోలీసులు వెళ్ళి సముద్రాల్ని నడిపించుకొచ్చారు.

అప్పటి వరకూ తాము అత న్నుండి సమాచార సేకరణకి చేసిన ప్రయత్నాలన్నీ వివరించారు సర్కిల్‌గారు. ఈ మూడు రోజు లుగా సముద్రాలుకి పచ్చి మంచి నీళ్ళు కూడా యివ్వలేదని చెప్పారు.

సముద్రాల్ని చూసి, ముందు ఆశ్చర్యపోయి, 'మరీ ఇంత చవట వెధవలేవిట్రా మీరు' అన్న ట్లుగా స్టేషన్ సిబ్బంది వైపు చూసారు దొరగారు. ఉమ్మడిగా తలొంచుకున్నారు సిబ్బంది.

"వాడలా కనిపిస్తున్నాడుగానీ, మొండి లంజకొడుకు సార్! ఎన్ని విధాల ప్రయత్నించినా చెప్పడే. తిండి, నీరు లేకుండా నెల్లాళ్ళుండ గల్డు" అన్నారు సర్కిల్ దొర గారితో.

దొరగారికి వంగి దణ్ణం పెట్టాడు సముద్రాలు. ఆయనతో తన మనసులో వున్నదంతా మొర పెట్టుకుందాం అనుకున్నాడు గాని నోట మాట పెగల్లేదు. నిస్సహా యంగా, నిస్సత్తువగా మాత్రం చూశాడు. అతను క్రింద కూలబడి పోకుండా జవాన్లు నిటారుగా నిల బెట్టి పట్టుకున్నారు.

"ఏరా ముసిలీ! అయితే చెప్ప వన్నమాట. అఁ! అంటే నీ వుద్దే శ్యంలో మేం నీ చేత చెప్పించ లేవఁనే కదూ" అన్నారు దొరగారు సూటిగా కళ్ళలోకి చూస్తూ. ఆ కళ్ళల్లో త్రాచుపాము కళ్ళల్లోని తీవ్రతవుంది గుండె గుభేలుమంది సముద్రాలుకి. చేతులు జోడించి ఏడుస్తూ వుండిపోయేడు.

పోలీస్ స్టేషన్లలోనూ, హైద్రా బాదులో ఆర్టీసీ బస్సుల కోసం నియమించబడ్డ మోబైల్ కోర్టుల లోనూ 'నిజం' చెప్పడం అంటే- మనం నేరం చేసినా, చెయ్యకపోయినా చేసామని ఒప్పేసుకోవడమేనని పాపం ఆ ముసలాడికేం తెలుసు?

"సరే. వీడినుంచి సమాచారం

యెలా రాబట్టాలో నేను చెబ్తాను గానీ వీడ్ని లాకప్‌లో పడేసి రండి ముందు" అన్నారు దొరగారు. ఆ పని అయ్యాక, చిరునవ్వుతో "మీలో ఎవ్వరికైనా రోలర్ ట్రీట్‌మెంటు గురించి తెల్సా?" అని ప్రశ్నించి, అందరి మొహాల్లోకి చూసారు.

ముందు తెల్ల మొహాలేసి, ఆ తర్వాత తెలుసుకోవాలనే కుతూహలం చూపించారందరూ.

లాఠీని రెండు అరచేతుల్లోనూ దొర్లిస్తూ, సీట్లో సర్దుక్కూర్చున్నారు- దొరగారు చెప్పడానికి వుపక్రమిస్తూ.

శ్రోతలందరూ చేతులు కట్టుకుని అతి శ్రద్ధగా మనసావాచా ఆయనకు అంకితమై పోయేరు.

"రోలర్ ట్రీట్‌మెంట్ అంటే- ఇది ఎవడికి ఇస్తున్నామో వాడికి ముందు వీలయినంత ఎక్కువ కాలం నుంచి ఆహారం గానీ, నీరు గానీ ఇవ్వకూడదు. తర్వాత వంటి మీది బట్టలన్నీ వూడ బెరికెయ్యాలి. ఓ రెండు గుడ్డలు బాగా లోపలి కంటా నోట్లో కుక్కెయ్యాలి. వాడ్ని బల్ల మీద వెల్లకిలా పడుకో బెట్టి, చేతులు వెనక్కి విరిచి బల్లకిందుగా ముడేసెయ్యాలి. తలని కిందకి వేళ్ళాడెయ్యాలి. కాళ్ళ బొటన వేళ్ళు రెండూ ముడెయ్యాలి. ఏం-ఇవీ ముందు చెయ్యాల్సినవి. అయిందా?-ఆ తర్వాత అరికాళ్ళల్లో ఎడతెరిపి లేకుండా కర్రతోనూ, చువ్వలతోనూ బాదుతూ, బరువైన రోలర్ని తొడల మీద పాదాల వరకూ నొక్కి పట్టి స్పీడుగా దొర్లించాలి. ఈ ట్రీట్‌మెంటు ఎలా పని చేస్తుందో తెల్సా? ఈ ముసలాడు కాదు, వీడి తల్లో జేజెమ్మ ఒప్పుకుంటుంది నేరం. ఒక సెకండులో చెప్తాడు వాడి కొడుకెక్కన్నాడో" అన్నారు దొరగారు హుషారుగా కళ్ళెగరేసి, నోట్లో సిగరెట్ పెట్టుకుంటూ. వెలిగిన మొహంతో గబుక్కున ముందుకొచ్చి దొరగారి సిగరెట్టు వెలిగించారు సర్కిల్‌గారు.

మెచ్చుకోలుగా ఓ చూపు విసిరి, "మరి ఎమర్జన్సీలో ఏం నేర్చుకున్నారయ్యా మీరూ?" అని అందర్నీ వెటకారం చేసారు దొరగారు.

దొరగారు చెప్పిన ప్రకారం- ఊరు సద్దు మణిగాక, చాలా సేపటి వరకూ సముద్రాల్నుంచి ఇతర పద్ధతుల్లోసమాచారం రాబట్టడానికి ప్రయత్నించి విఫలురై, సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటలకు సముద్రాలుపై రోలర్ ట్రీట్

మెంటు ప్రయోగించ ప్రారంభించారు స్టేషన్ సిబ్బంది. అంతకు ముందే సీసాలు ఖాళీ చేసి వున్నారేమో, గాలిలో తేలిపోతున్నట్లు వుంది. జన్మలో కనీవినీ యెరుగని ఈ వింత పద్ధతి గురించి తెలుసుకుంటూనే తాము అవలంభించడానికి అవకాశం దొరికినందుకు అమితానందంతో తూలిపోతూ, నవ్వుతూ కేరుతూ, నిర్విఘ్నంగా, నిరాటంకంగా తమ రాక్షస కృత్యం సాగిస్తున్న సిబ్బంది-"ఓర్నాయనోయ్-వీడు చచ్చాడండోయ్" అన్న హెడ్డుగారి కేకకి ఇబ్బందిలో పడ్డారు.

ఇదేమిటి ఇలా జరిగింది!! ఏం దారి? ఏం చెయ్యాలి? ఏమవుతుంది? ఇప్పుడు బాధ్యులెవరవుతారు??....ఒక టేమిటి ప్రశ్నల తోరణం.

అందరూ తలలు పట్టుకు కూలబడ్డారు.

ప్రతి వాళ్ళకూ భార్యా పిల్లలు గుర్తొచ్చారు.

* * *

గోపాలం హైద్రాబాదులో సినిమా ఛాన్సుల కోసం చేసిన మూడు రోజుల ప్రయత్నం విఫలమై పోయింది. ఎప్పటికి దొరుకుతుందో కూడా వూహకి అందట్లేదు. శేఖర్ కూడా మాటివ్వలేనన్నాడు. పైగా జీవితంలో మొట్టమొదటిసారిగా తండ్రికి దూరమై వుండడం దుర్భరంగా వుంది. 'రాజా మాటలకు సంతృప్తి చెందాడో లేక దిగులుతో మంచం పట్టాడో తండ్రి' అని మనసు పీకుతోంది. దగ్గర డబ్బులు కూడా అయిపోయాయి. అంతకే ఈ మూడు రోజులూ కడుపు నిండా ఒక్కసారైనా తిండి కూడా తినలేదు. ఇంటికి తిరిగి వెళ్ళి పోవాలనే నిశ్చయించుకున్నాడు గోపాలం.

ఫస్టుక్లాసు కంపార్టుమెంటు దగ్గర ఖరీదైన సిగరెట్టు పొగల మధ్య ఇంకా ఖరీదైన బట్టల్లో దూరి నిల్చున్న పెద్ద మనిషిని చూస్తూనే అటు గబగబా నడిచాడు గోపాలం.

"నమస్కారమండీ" అంటూ రెండు చేతులూ జోడించాడు ఆ వ్యక్తి.

గుర్తు పట్టనట్లు చూస్తూ చిన్నగా తలాడించాడు ఆ వ్యక్తి.

"నా పేరు గోపాలమండీ. నేను మీ అబ్బాయి రాజా ఫ్రెండుని. ఇక్కడ కొంచెం పనుండి వచ్చాను. ఈ రైల్లోనే నేనూ మనూరొచ్చేస్తున్నాను" అని హుషారుగా చెప్పాడు.

అతని మాటలకి ఏ మాత్రం విలువ ఇవ్వనట్లుగా చూసి, 'ఇహ చాల్లే' అన్నట్లుగా ఇంకో వైపు తిరిగాడు ఆయన.

గోపాలం చిన్నబుచ్చుకున్నాడు. "వస్తానండీ" అని సెకండు క్లాసు కంపార్టుమెంటువైపు నడిచాడు.

రైలు కదలడానికి సిద్ధమవుతోందని తెలియజెప్పే సూచనగా విజిల్పు, రైలు లోపల బయట జనం హడావుడి ఎక్కువయ్యాయి.

"ఇదిగో అబ్బాయ్-నీ పేరేవిఁటన్నావు ఇందాకా?"

-ఉలిక్కిపడి, అటు చూసాడు గోపాలం. రాజా తండ్రి. చేతిలో బ్యాగ్.

గబుక్కున లేచి నిల్చుని, "గోపాల వండి" అన్నాడు.

"ఓ మాటిలారా" అని గుమ్మం వైపు తీసుకుపోయేడాయన.

రైలు బయల్దేరింది.

"నా పర్సెవడో దొంగముండా కొడుకు కొట్టేశాడయ్యా. టిక్కెట్టు డబ్బు అంతా కూడా అందులోనే వున్నాయి. నీ దగ్గరేవఁన్నా డబ్బుందా? కనీసం టిక్కెట్టుకి సరిపోయేదివున్నా చాలు. మనూ రెళ్ళగానే ఇచ్చేస్తా"-మొహమాట పడుతూ, 'నిన్నడుక్కోవలసిన ఖర్మ వచ్చింది కదా' అన్నట్లుగా మొహంపెట్టి అడిగాడాయన.

నోటమాటరాలేదు గోపాలానికి. తన దగ్గర టిక్కెట్టు, కొద్దిగా చిల్లర డబ్బులు తప్పితే ఇంకేవీఁలేవు.

తన ప్రశ్నని రెట్టించాడాయన.

"క్షమించండి సార్। నా దగ్గర ఒక్క టిక్కెట్టు మాత్రమేవుంది, ఇంకన్నలు డబ్బులేదు" తప్పు చేసిన వాడిలా తలవంచుకున్నాడు గోపాలం.

"ఎలాగయ్యా ఇప్పుడు మరి? నేనిప్పుడీ బండికే వెళ్ళతీరాలి. ఫస్టు క్లాస్ కాకపోయినా, ఏదో తంటాలుపడి ఈకంపార్టుమెంట్లో నైనావెళ్ళాలి ఎలాగ?" అన్నాడాయన కణతలు నొక్కుకొంటూ. కొంచెంసేపు వూరుకుని ఏమీ తోచక, "ఎలాగోలా చూడు బాబూ, మనూరెళ్ళాక వంద రూపాయలిస్తాన్నీకు" అని ఆశ పెట్టాడు.

"ఛఛ అదుకోసం కాదండీ. ఏం చెయ్యాలా అనే నేనూ ఆలోచిస్తున్నాను. పోనీ నేను ఆగిపోదామన్నా నేనూ ఈ బండికే వెళ్ళాలి. పైగా నాదగ్గర చిల్లు కానీ కూడా లేదు....సరే సార్, భగవంతుడి మీద భారంవేసి ఒక పని చెయ్యడానికి నిశ్చయించుకొన్నాను.

ఇదుగో ఈ టిక్కెట్టు మీరు తీసుకోండి.”

“మరి నువ్వో?” అని ఆశ్చర్యపోతూ అడగలేదు ఆయన. ఆనందంగా అందుకున్నాడు.

అన్నట్లుగానే భగవంతుడి మీద భారంవేసి, టిక్కెట్టు లేకుండానే దొంగచాటు ప్రయాణం సాగించాడు గోపాలం.

కిటికీ దగ్గర సీట్లో ఒరిగి హాయిగానే నిద్రపోయేడు రాజా తండ్రి.

ఆనందం పొంగి పొర్లింది కనుచూపుమేరలో తనవూరుపిమూడగానే గోపాలంలో.

ఊరి పొలిమేరల్లో ఒక్క ఊపిచ్చి ఆగింది రైలు. రైలు ముందు భాగంలో మొదలైన అల జడి పెద్దవుతూ క్రమేపీ వెనక దాకా పాకింది. నిద్రపోతున్న వాళ్ళకూడా విసుక్కుంటూలేచారు. రాజా తండ్రి లేచి బ్యాగ్ సర్దుకున్నాడు.

జనం దిగి రైలు వెనక్కి వెళుతున్నారు గబగబా.

“ఏంవిటి, ఏం జరిగింది?” అందరూ ఇదే ప్రశ్నలు.

పట్టాలమీద పెద్ద గుంపుగా జనం. జనంలోకి దూరి గుంపు కేంద్రస్థానాన్ని చేరాడు గోపాలం.

రైలుపట్టాకు అటూ ఇటూ సరిగ్గా సగానికి తెగిన శవం.

“ప్చ్. ఎవరో దురదృష్టవంతుడు.”

“కుటుంబ కలహాలేమో.”

“తాగుడై వుండొచ్చు.”

“ఏదో ఒకటి. మొత్తానికి చచ్చాడు.”

ఎవరో బ్యాట్రీ లైటు వేశారు శవం మీదకు.

ఆ వెలుతుర్లో శవాన్ని చూసిన గోపాలం గుండెలు పిడచగట్టుకుపోయేయి. మెదడు కంపిస్తోంది. కాళ్ళు పట్టుతప్పుతున్నాయి. కళ్ళ రెప్పలు నిలిచిపోయేయి.

“అయ్యో!!!”

—గుంపు ఉలిక్కిపడింది ఆ కేకకి. ప్రక్కకు జరిగి దారిచ్చింది.

గుండెలుపగిలేలాగ బావురుమని తండ్రి శవాన్ని కౌగలించుకొన్నాడు గోపాలం.

ఒక సానుభూతి నిట్టూర్పు విడిచి, జనాన్ని వెనక్కి పిలిచి హుషారుగానే కదిలింది రైలు.

భయంకరమైన చీకటి, నిశ్శబ్దం. చుట్టుప్రక్కల ఎక్కడా నర సంచారంలేదు. ఓదార్చేవారు, సానుభూతిచూపించేవారు లేరు. ఆ నిశ్శబ్దంలో తన ఏడ్పు తననే భయ

పెడుతుంది. ఏడ్చి ఏడ్చి శోషకొట్టి నట్లయ్యింది గోపాలానికి.

భుజంమీద చెయ్యి పడడంతో నెమ్మదిగా తలెత్తి చూశాడు.

రాజా నైట్‌డ్రస్‌లో వున్నాడు.

గబుక్కున లేచి, "రాజా!" అంటూ గట్టిగా కౌగలించుకొని బావురుమన్నాడు గోపాలం.

"ఊరుకో! ఏడవకు. డాడీ చెప్పారు. అందుకనే కారేసుకు వచ్చాను" అన్నాడు రాజా- గోపాలానికి నెమ్మదిగా దూరంగా జరుగుతూ.

"ఏవిటిది రాజా? ఎందుకు, ఎలా జరిగిందిది?" అన్నాడు గోపాలం తండ్రి శవంవైపు చూపిస్తూ.

రాజా తాపీగా చెప్పడం మొదలు పెట్టాడు.

"గోపాలం నువ్వెళ్ళినమర్నాడు పొద్దున్నే మీ నాన్న మా ఇంటికి వచ్చాడు. నువ్వు చెప్పమన్నట్లే చెప్పాను. చాలాసేపు బాధపడ్డాడు. మంచి ఉద్యోగం సంపాదించుకొని వీలైనంత త్వరలో తిరిగొచ్చేస్తా వని చెప్పాను. సంతోషపడ్డట్టే కని పించాడు. కాని ఇంతలో ఓ దారుణం జరిగింది. రాయుడు తెల్సు కదా నీకు. వాడ్ని నువ్వెళ్ళిన రాత్రే ఎవరో మర్డర్ చేశారు. నువ్వు కనిపించకుండాపోవడం, రాయుడ్ని ఎవరు చంపారో తెలియకపోవ డంతో పోలీసులకి నీమీద అను మానం కలిగింది. మీ నాన్నని నీ గురించి చాలా ప్రశ్నించారు కూడా."

మెదడు వెయ్యి చెక్కలైనట్ల యింది గోపాలానికి. తల గట్టిగా పట్టుకొని పట్టాలమీద కూర్చుండి పోయాడు.

"దాంతో మీ నాన్నకి మరీ విచారం పట్టుకొంది. ఈ మూడు రోజులూ పచ్చి మంచి నీళ్ళు ముట్టలేదు. చివరకి ఇంత పని చేసాడన్న మాట!" అన్నాడు రాజా సముద్రాలు శవాన్ని జాలిగా చూస్తూ.

మోకాళ్ళమీద తల పెట్టుకొని రోదిస్తున్నాడు గోపాలం.

"గోపాలం, జరిగిపోయిందేదో జరిగిపోయింది. దానికి- నాకూ గుండెలు పగిలేలాగ బాధగానే వుంది. కానీ ఇంకోపెద్ద ప్రమాదం వుంది. అందుకనే అర్ధరాత్రయినా డాడీ ఈ విషయం చెప్పగానే కారే సుకు వచ్చాను. రాయుడి హత్యకి

సంబంధించి పోలీసులకి నీ మీద అనుమానం చాలా బలంగా వుంది. నీ కోసం తెగ గాలిస్తున్నారు వాళ్ళు. ఇప్పుడు నువ్వు వూళ్ళోకి వచ్చావంటే నీ జీవితం చేతులారా కటకటాల పాలుచేసుకుంటావు. నీ తరపున మాట్లాడే వాళ్ళెవరూ వుండరు. ఈ పరిస్థితుల్లో ఎవ్వరి మాటా చెల్లదుకూడా. కాబట్టి నా మాట విను-వెంటనే ఈ వూరికి వీలయినంత దూరంగా పారిపో. కమాన్. లే!"

—నిర్వణ్ణుడయిపోయేడు గోపాలం.

"రాజా! నువ్వు.... నన్ను?.... నేను..." మాటలు పెగల్లేదు.

"నీకు తెలియదు గోపాలం. ఇక్కడి పరిస్థితి అది. ప్రాణ స్నేహితుడిగా నీ క్షేమం కోరే వాణ్ణి కాబట్టి చెబుతున్నాను. ఇంక ఈ వూళ్ళో నీకు బంధాలు ఏం వున్నాయి. చెప్పు? ప్లీజ్ గోపాలం! నిన్ను నువ్వు రక్షించుకో. ఆలస్యం చెయ్యకు. నేనిలా వచ్చినట్లుగా ఎవరికి తెలిసినా ప్రమాదం. నీ తండ్రి శవానికి దహన సంస్కారం నేను చేయిస్తాను."

"రాజా! ఈ గడ్డమీద పుట్టాను. ఈ గడ్డమీదే ఇప్పటి వరకూ పెరిగాను. తెలివితక్కువ పనిచేసి తండ్రిని పోగొట్టుకున్నాను. ఇప్పుడు నా వూరుతో సంబంధం కూడా పోగొట్టుకోనా?" వెక్కుతూ అన్నాడు గోపాలం.

"అయ్యో, వెర్రివాడా! నన్ను నువ్వు అర్థం చేసుకోవడంలేదు. పుట్టిన వూరుకంటే ముందున్న నూరేళ్ళజీవితం ముఖ్యం. ఇంకేమీ ఆలోచించకు. లే. కమాన్." చెయ్యి పుచ్చుకున్నాడు రాజా.

లేచి నిలబడ్డాడు గోపాలం.

స్నేహితుణ్ణి కౌగలించుకున్నాడు.

తండ్రి శవానికి పాదాభివందనం చేసాడు.

ఊరివైపు తిరిగి నమస్కరించాడు.

వెనక్కి తిరిగి శక్తి కొద్దీ పరిగెట్టాడు.

—'అమ్మయ్య' అనుకుని, కట్టడిగి, శరీరంలో నిరక్తం హుషారుగా పరుగులు తీస్తూండగా ఖుషీగా కారు స్టార్టుచేసాడు రాజా. పళ్ళు కొరుకుతూ, విజయగర్వంగా "రాయుడూ! నీ చరిత్రకి ఇంతటితో గోరీ కట్టేశాను" అని కూడా అనుకున్నాడు. ◆